ప్రజాశక్తి

శుక్రవారం 21 నవంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం




అనకాపల్లి

అజెండా 90 అంశాలు

◆ నేడు జివిఎంసి సర్వసభ్య సమావేశం ◆ అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ రద్దుకు చర్చ సాగేనా ?

◆ ఎండాడ, ముడసర్లోవలో ప్రభుత్వ భూములను బీచ్ రిసార్ట్ ప్రాజెక్టులుగా మార్చే అవకాశం

◆ ఎకరాలకు ఎకరాలను టూరిజం శాఖకు అప్పగించే యత్నాలు



జివిఎంసి సమావేశ మందిరం (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జివిఎంసి సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు జివిఎంసి నూతన సమావేశపు హాలులో జరుగనుంది. దీంట్లో 90 సాధారణ అజెండాలు సభ్యుల చర్చ, ఆమోదానికి రానున్నాయి. ఈ ఏడాది అక్టోబర్ 22న జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు చేసిన తీర్మానాలను ఆమోదానికి పెట్టనున్నారు. 90 ప్రధాన చర్చనీయాంశమైన అజెండాలకు సంబంధించి విశాఖ గ్రామీణ ప్రాంతం ఎండాడ ప్రాంతంలో పలు ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం పలు సంస్థలు, టూరిజం ప్రాజెక్టులకు కేటాయించేందుకు జివిఎంసిని కోరినట్టుగా స్పష్టంగా తెలుస్తోంది. టూరిజం ప్రాజెక్టులకు, అలాగే ఆసియన్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆసుపత్రి నిర్మాణం వంటి వాటికి కేటాయించేందుకుగానూ జివిఎంసి కౌన్సిల్ అజెండాలో చేర్చి ఆమోదానికి ఎదురు చూస్తుండడం గమనార్హం. మధురవాడ సర్వే నెంబర్ 426-3లోగల 9.39 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎపి పర్యాటక శాఖకు కేటాయించేందుకు జివిఎంసి ప్రతిపాదన చేసింది. ఆసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆసుపత్రి వారి కోసం ఎండాడలోని పలు సర్వే నెంబర్లలో 14.79 ఎకరాలను కేటాయించేందుకు అజెండా 79ను చేర్చారు. భీమిలిలోని కొండవాలు ప్రాంతాలు కలిగిన కొత్తవలస గ్రామంలో పలు ఎకరాలను కేటాయించేందుకు సిద్ధమయ్యారు.

అదాని అంబుజా సిమెంట్ రద్దు కావాల్సిందే : సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు

పెదగంట్యాడలో అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రతిపాదనను రద్దు చేయాలన్న అంశాన్ని కౌన్సిల్ అజెండాలో పెట్టాలని కోరుతూ సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు గురువారం జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సిమెంట్ ఫ్యాక్టరీవల్ల ఆ ప్రాంతం అంతా కాలుష్యంగా మారి ప్రజల జీవనానికి తీవ్ర ఆటంకం కలుగుతుందని తెలియజేశారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా రద్దు చేయాలనే డిమాండ్ ప్రజల నుంచి వచ్చిందని మిగతా 2లో..

సమన్వయంతో ఐఎఫ్ఆర్ విజయవంతం

ఏర్పాట్లపై సమీక్షించిన జిల్లా కలెక్టర్, నేవీ ఉన్నతాధికారులు



ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్, నేవీ అధికారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 - 20 తేదీల మధ్యలో జరుగనున్న ఐఎఫ్ఆర్ (ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ) - 2026ను విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో కలిసి పని చేస్తామని జిల్లా అధికారులు, నేవీ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఐఎఫ్ఆర్ ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జెసి కె.మయూర్ అశోక్, విఎంఆర్‌డిఎ కమిషనర్ తేజ్ భరత్, డిసిపి మణికంఠ చందోలు, నేవీ ఉన్నతాధికారులు, కమొడర్లు అమీ మాథ్యూ, రజ్నీష్ శర్మ, కెప్టెన్ ఎమ్‌డి అనూప్రజ్, కమాండర్లు వైకె.కిశోర్, ప్రవీణ్ కుమార్, మనోజ్ కుమార్, కెఎన్.మొహంతే, లెఫ్టినెంట్ కమాండర్ వీరేందర్ కుమార్ తదితరులు ఈ చర్చా కార్యక్రమంలో పాల్గొని వివిధ అంశాలపై సమీక్షించారు. రాష్ట్రపతి, ప్రధాని, రక్షణ మంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర రాజకీయ, అధికార ప్రముఖులు రానున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లపై సుదీర్ఘంగా సమీక్షించుకున్నారు. ఎవరెవరు ఏయే పనులు చేయాలో, ఏ విధంగా సమన్వయం చేసుకోవాలో ప్రాథమికంగా నిర్ణయించుకున్నారు.

ఈ సందర్భంగా కమొడర్ అమీ మాథ్యూ ఫ్లీట్ రివ్యూ -2026, మిలాన్ నిర్వహణ, అథితుల రాక తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. సుమారు వంద మిత్ర దేశాల నుంచి అతిథులు విచ్చేస్తారని, వారందరికీ రవాణా, వసతి సదుపాయం కల్పించాల్సి ఉందని అన్నారు. ఫిబ్రవరి 15 నుంచి 20 వరకు మిలాన్ విలేజ్ కార్యక్రమం కొనసాగుతుందని, 18న రాష్ట్రపతి ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, 19న సిటీ పరేడ్‌తో పాటు మిలాన్ ప్రారంభోత్సవం ఉంటుందని చెప్పారు. 19, 20 తేదీల్లో మిలాన్ హార్బర్ ఫేజ్ ఉండగా 21 నుంచి 25 వరకు సీ ఫేజ్ ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యేందుకు అతిరథ మహారథులు హాజరవుతున్నారని తెలిపారు. ఐఎఫ్ఆర్ - 2026, మిలాన్ నేపథ్యంలో కాన్వెంట్ మిగతా 2లో..

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలి

▶ వార్త 8లో..

నేడు శాసన సభాపక్ష పిటిషన్ల కమిటీ పర్యటన

▶ వార్త 2లో..

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

▶ వార్త 6లో..

వెటరన్ అధికారుల సాహస సాగర యాత్ర

టిస్టీపై న్యూజిలాండ్ నుంచి విశాఖకు రాక



సాహస యాత్ర చేసిన వారితో నేవీ అధికారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సంకల్పం, పట్టుదల, సాహసం.. ఈ మూడు లక్షణాలకు నిదర్శనంగా నిలిచారు ఇద్దరు భారత సైనికదళాల సీనియర్ అధికారులు. భారత నౌకాదళం నుంచి ఉద్యోగ విరమణ చేసిన కర్నల్ కె.శ్రీనివాస్, కెప్టెన్ సిడిఎన్‌వి.ప్రసాద్ తమ సొంత ఓషన్-క్రూయిజింగ్ పడవ 'టిస్టీ'పై న్యూజిలాండ్ నుంచి భారతదేశం వరకు అద్భుతమైన సుదీర్ఘ సాగరయానాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సాహసయాత్రకు గుర్తుగా, విజయాన్ని సూచించే 'ఫ్లాగ్-ఇన్' వేడుక విశాఖపట్నంలోని నావల్ బేస్ వద్ద గురువారం ఘనంగా జరిగింది. వైస్ అడ్మిరల్ కుడ్రవల్లి శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఈ వేడుకకు పూర్వ విద్యార్థులు, నౌకాదళ సిబ్బంది, కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా కర్నల్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 'ఈ సాహసయాత్ర మే 13న న్యూజిలాండ్‌లోని ఓపువా నుంచి ప్రారంభమైంది. ఫిజీ మీదుగా 1,150 నాటికల్ మైళ్ళ ప్రయాణించిన తర్వాత, మొదటి ముఖ్యమైన విరామం సోలమన్ దీవులలోని పోర్ట్ నోరో వద్ద తీసుకున్నాం. సోలమన్స్ దీవుల దగ్గర 'టిస్టీ' అల్లకల్లోలమైన సముద్రాన్ని ఎదుర్కొంది. ఆ సమయంలో కెప్టెన్ ప్రసాద్ మోకాలికి గాయమైంది. ఈ పరిస్థితి కారణంగా జకార్తా వరకు తదుపరి ప్రయాణాన్ని కొనసాగించాం. మిషన్‌కు మద్దతు ఇవ్వడానికి మిగతా 2లో..

విద్యారంగ సమస్యలపై

ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలి

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్



మాట్లాడుతున్న ప్రసాద్

ప్రజాశక్తి - అనకాపల్లి

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకొని ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జెఎసి రాష్ట్ర సెక్రటరీ జనరల్ కెఎస్-ఎస్.ప్రసాద్ డిమాండ్ చేశారు. అనకాపల్లిలోని సిఐటియు కార్యాలయంలో గురువారం జరిగిన యుటిఎఫ్ జిల్లా కార్యదర్శివర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సర్వీసులో ఉన్న టీచర్లందరూ తప్పనిసరిగా టెట్ పాస్ అవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రివ్యూ పిటిషన్ వేయాలన్నారు. 2010కి ముందు ఉపాధ్యాయ అర్హత పరీక్ష లేదని, అలాంటప్పుడు అంతకు ముందు ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన వారు కూడా టెట్ పాస్ అవ్వాలనే నిబంధన ఎందుకని ప్రశ్నించారు. టెట్ నుంచి వారిని మినహాయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం విడుదల చేసిన మెమో 57 ప్రకారం 2004కు ముందు విడుదలయిన నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగంలో జాయిన్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం సుముఖంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం వారికి పాత పింఛను విధానాన్ని అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. బోధనేతర పనుల భారం ఉపాధ్యాయులపై అంతకంతకూ పెరుగుతోందన్నారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పనిచేస్తున్న ఏకోపాధ్యాయులు, ఐచ్ఛిక సెలవులను వాడుకొనే వెసులుబాటు కల్పించాలన్నారు. ట్రాన్స్‌ఫర్ అయినప్పటికీ ఇంకా రిలీవ్ కాని ఉపాధ్యాయులను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, వారిని వెంటనే కొత్త పాఠశాలలకు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలి

పంపాలని డిమాండ్ చేసారు. మెగా డిఎస్సి ద్వారా ఎంపిక కాబడి నూతనంగా ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు నేటికీ జీతాలు అందకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం వెంటనే జీతాలు చెల్లించడానికి తగు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై ఇప్పటి వరకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం కాలేదని, అది సరికాదని అన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజి శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వి.శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్, జిల్లా గౌరవాధ్యక్షులు పంపనబోయిన వెంకటరావు, సహాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శులు గుత్తుల సూర్య ప్రకాష్, వైరాల రమేష్‌రావు, నడిగట్ల శేషు కుమార్, వెంగళ చైతన్య శీల, రాష్ట్ర కౌన్సిలర్లు ఎల్లయ్య బాబు, ఎంవి.అప్పారావు, గేదెల శాంతి దేవి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ఐఎఫ్ఆర్ విజయవంతం

జంక్షన్ నుంచి మారుతీ జంక్షన్ వరకు, అక్కడి నుంచి నేవల్ ఫేస్, హార్బర్ ఫేస్ వరకు ఎన్‌హెచ్ఎఐ, పోర్టు పరిధిలోని రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఫ్లై ఓవర్ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సివిల్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ పక్కాగా చేయాలని, పార్కింగ్, శానిటేషన్, సిటీ బ్యూటిఫికేషన్ పనులు సమన్వయంతో చేయాల్సి ఉందని అన్నారు.

జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలి : కలెక్టర్

పలు అంశాలపై స్పందించి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ జిల్లాలోని వివిధ విభాగాల అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమ నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలని, ఇప్పటి నుంచే సంబంధిత పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఇండియన్ నేవీ, పోలీసు, ఎన్‌హెచ్ఎఐ, గెయిల్, హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్ ప్రతినిధులతో పాటు, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ సుధాసాగర్, ఎన్‌హెచ్ఎఐ పీడీ ప్రభత్ రంజన్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అజెండా 90 అంశాలు

అందులో పేర్కొన్నారు. ఈ అంశంపై కౌన్సిల్‌లో చర్చ జరుగుతుందో లేదో చూడాలి.

కార్పొరేటర్ల హడావుడి

నగరంలోని పలువురు ప్రధాన పార్టీలకు చెందిన కార్పొరేటర్ల హడావుడి కౌన్సిల్ సమావేశానికి ముందు నుంచీ కనిపిస్తోంది. 2026 మార్చిలోగా నగర పాలనలో తమ పాత్ర రద్దుకానుండడం (కౌన్సిల్ ఉండనందున) ముందస్తుగానే పలు ప్రతిపాదనలతో అధికారులు, మేయర్ చుట్టూ తిరుగుతున్నారు. పలు వ్యక్తిగత పిటిషన్లతోనూ, సిఫారసులతోనూ జివిఎంసి ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారడంతో జివిఎంసిలో ప్రస్తుతం ఇదే చర్చ సాగుతోంది. మహా అయితే ఒక బడ్జెట్ సమావేశం, మరోదఫా జనరల్ బాడీ ఉండొచ్చు. దీంతో కార్పొరేటర్లు పలువురు తమ దందాలకు పదును పెడుతూ స్టాండింగ్ కమిటీలో అజెండాలో అంశాలను చేర్చడం, ఆమోదానికి తెగ తాపత్రయ పడటం కనిపిస్తోంది. రూ.కోట్లతో రోడ్ల ప్రతిపాదనలను కౌన్సిల్ ముందుంచారు.

ఉద్యాన వన శాఖకు సంబంధించిన హార్టికల్చరిస్టులు, తోటమాలీలు, గార్డెన్ సూపర్‌వైజర్లు, వాచ్‌మెన్లు, స్వీపర్, డ్రైవర్లు సుమారు 50 మంది పొరుగు సేవల సిబ్బందికి 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకూ వేతనాల వ్యయాన్ని రూ.84.66 లక్షల అంచనా వ్యయాన్ని ప్రతిపాదిస్తూ వారిని కొనసాగిస్తూ ఆప్కాస్ ద్వారా గౌరవ వేతనాలను చెల్లించేందుకు ప్రతిపాదన (అజెండా-4)గా నిర్ణయించారు. ప్రజారోగ్య విభాగంలో ఒకే కేడర్‌లో ఆరేళ్లు పూర్తిచేసుకున్న శానిటరీ సూపర్‌వైజర్లను స్పెషల్ గ్రేడ్ పే స్కేల్ మంజూరు కోసం ప్రతిపాదన చేశారు.

వెటరన్ అధికారుల సాహస సాగర యాత్ర

లెఫ్టినెంట్ కర్నల్ ప్రదీప్ రంగంలోకి దిగారు. జకార్తా నుంచి పోర్ట్ బ్లెయిర్ వరకు కర్నల్ శ్రీనివాస్‌తో ఆయన కుమారుడు అజితేష్ జతకట్టి ఈ యాత్రకు మధురమైన కుటుంబ జ్ఞాపకాన్ని అందించారు. చివరి విడత ప్రయాణం కోసం కెప్టెన్ ప్రసాద్ పోర్ట్ బ్లెయిర్‌లో 'టిస్సే'తో తిరిగి కలిశారు. ఈ స్నేహితుల ద్వయం అక్టోబర్ 14న పోర్ట్ బ్లెయిర్ నుంచి బయలుదేరి నవంబర్ 20న గర్వంగా విశాఖపట్నం చేరుకుంది' అని చెప్పుకొచ్చారు.

ఎరుకుమాంబ హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ :దొండపర్తి జంక్షన్‌లోని ఎరుకుమాంబ దేవస్థానం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 78 రోజులకు భక్తులు హుండీలో వేసిన కానుకల ఆదాయం రూ.3,89, 639 వచ్చిందని ఆలయ ఇఒ డివిఎస్ సురేష్‌బాబా తెలిపారు.

భాగస్వామ్య సదస్సు జయప్రదం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అందరి శ్రమ, సమష్టి కృషితోనే భాగస్వామ్య సదస్సు విజయవంతమైందని జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. బుధవారం రాత్రి వీఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో అభినందన సభలో సీఐఐ సమ్మిట్ విజయవంతంలో భాగమైన ప్రతిఒక్కరి కృషిని అభినందించారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇతర అధికారులు తనకు వెన్నుదన్నుగా నిలిచారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా అధికార యంత్రాంగం, సీఐఐ ప్రతినిధులు సమన్వయంతో పనిచేసిన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. భాగస్వామ్య సదస్సు నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులకు,ఉద్యోగులకు కలెక్టర్, సిపి, జెసి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

'వండర్ కిడ్స్' రామునాయుడుకు అవార్డు

ప్రజాశక్తి - ఎంవిపి. కాలనీ.:ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా జాతీయ విద్యా సమాజానికి గర్వకారణంగా నిలిచిన, స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ఛైర్‌పర్సన్ మల్ల రామునాయుడుకు నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అలయన్స్ (నీసా) నుంచి అంతర్జాతీయ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. న్యూఢిల్లీలోని ద్వారక యశోభూమిలో ఈనెల 18 నుంచి 20 వరకు ఆసియాలోనే అతిపెద్దదైన నిర్వహించిన అంతర్జాతీయ విద్య, నైపుణ్య శిఖరాగ్ర సమావేశం (టిఐఇఎస్ఎస్) 2025లో అవార్డును స్వీకరించారు. ప్రాథమిక విద్యారంగంలో అసాధారణ సేవలు, వినూత్నమైన ఎడ్యూ-ఈజీ బోధనా విధానం, చిన్నారులకు ఆనందభరితమైన, ఒత్తిడిలేని, పునాది బలమైన విద్య అందించాలనే జీవితపరమైన అంకితభావం రామునాయుడుకు పురస్కారం వరించేలా చేశాయి. నాయుడు తన దూరదృష్టి నాయకత్వ పటిమతో స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్‌ను దేశంలోనే ఆదర్శనీయ విద్యాసంస్థగా తీర్చిదిద్ది, అనేక పాఠశాలలను స్ఫూర్తి ప్రదాతగా నిలిపారన్నారు. బాలల కేంద్రిత, ఫలితాల ఆధారిత బోధనా విధానాలను అనుసరించేందుకు అనేక విద్యాసంస్థలను ప్రేరేపిస్తోందన్నారు.. స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ సిబ్బంది, నిర్వహణ మండలి, సంస్థకు అపారమైన గౌరవాన్ని అందించిన మల్ల రామునాయుడుకు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో భారతీయ శిక్ష బోర్డు ఛైర్మన్ డాక్టర్ ఎన్‌పి సింగ్, నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అలయన్స్ అధ్యక్షులు కులభూషణ్, డొమినిక్ సావేజ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకుంటున్న రామునాయుడు

నేడు శాసన సభాపక్ష పిటిషన్ల కమిటీ పర్యటన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కె.రఘురామ కృష్ణరాజు అధ్యక్షతన శాసన సభాపక్ష పిటిషన్ల కమిటీ శుక్రవారం జిల్లాలో పర్యటించనుంది. సమగ్ర భూ సర్వే అంశంపై చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చేసిన ఫిర్యాదు పరిశీలనలో భాగంగా జిల్లాకు వస్తున్న కమిటీ ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ మీటింగ్ హాలులో జిల్లా అధికారులతో సమావేశం కానుంది. సమగ్ర భూ రీసర్వే, ఇతర భూ సంబంధిత అంశాలపై సర్వే అండ్ ల్యాండ్ రికార్డు విభాగం, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్షించి, ఫిర్యాదులు స్వీకరించనుంది. కమిటీ అధ్యక్షుడు, డిప్యూటీ స్పీకర్ కె. రఘురామకృష్ణరాజు, సభ్యులు గంటా శ్రీనివాసరావు, గురజాల జగన్ మోహన్, కొణతాల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్ రాజు విచ్చేస్తున్నారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు.

తెలుగుభాష పరిరక్షణకు ప్రజా ఉద్యమం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : తెలుగుభాష పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ఉద్యమం ఉధృతం చేస్తామనితెలుగు దండు అధ్యక్షులు పరవస్తు సూరి అన్నారు. తెలుగు భాష రక్షణకు తెలుగు దండు చేపట్టిన టిట్టిభ సత్యాగ్రహం గురువారం 11వ రోజుకు చేరింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలుగుభాష రక్షణకు చర్యలు చేపట్టకుంటే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని, రానున్న స్థానిక ఎన్నికలను ప్రభావితం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ కొచ్చెర్లకోట, అడపా రామకృష్ణ, తిరుపతి రాజమన్నార్ పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న జిల్లా కలెక్టర్, జా ష్యూరేటర్

కంబాల కొండలో వన సమారాధన

ప్రజాశక్తి - ఆరిలోవ : అటవీశాఖ ఆధ్వర్యంలో కంబాలకొండ ఎకో పార్కులో కార్తీక వన సమారాధన గురువారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ బి.మహ్మద్ దివాన్ మైదిన్, జిల్లా అటవీశాఖాధికారి జి.మంగమ్మ పాల్గొన్నారు. కంబాల కొండలో కొనసాగుతున్న పర్యావరణ పరిరక్షణ, సందర్శకులకు అనుకూలమైన ప్రాజెక్టులను జిల్లా కలెక్టర్ సమీక్షించారు. నివాస ప్రదేశాల సంరక్షణ, ప్రకృతి ఆధారిత వినోదాన్ని పెంపొందించేందుకు తీసుకుంటున్న చర్యలను ఆయన అభినందించారు. కంబాల కొండలో వాచ్‌టవర్, కెనోపి వాక్‌ను సందర్శించారు. ఇవి ఎకో టూరిజం, పర్యావరణ అవగాహనను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్, జూ క్యూరేటర్ రెండు టీమ్‌లుగా ఏర్పడి వాలీబాల్ ఆడారు. అనంతరం ఏర్పాటు చేసిన వనసమారాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారి శ్రీవాణి, ఉప విభాగ అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాత దుస్తుల సేకరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : నిరుపేదలకు, అనాథలకు ఇచ్చేందుకు యువ భారత్ భీమిలి శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పాత దుస్తులు సేకరిస్తున్నట్లు యువ భారత్ భీమిలి శాఖ కన్వీనర్ ఎస్.జోగారావు తెలిపారు. దుస్తులు ఇవ్వాలనుకున్న వారు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల దగ్గర్లో ఉన్న వివేకానంద రీడింగ్ రూం వద్ద అందజేయాలని కోరారు.

మంచి పౌరులుగా ఎదగాలి

జిల్లా ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : దేశం గర్వించే విధంగా మంచి పౌరులుగా ఎదగాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎ.సోమేశ్వరరావు అన్నారు. బాలల దినోత్సవం, అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని దీనదయాల్‌పురం ప్రభుత్వ బాలుర గృహంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.సోమేశ్వరరావు, బాలల హక్కుల అవగాహన ఫోరం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గొండు సీతారాం మాట్లాడారు. పిల్లల అభిరుచిని తెలుసుకొని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. గృహంలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని పరివర్తన చెందిన పౌరులుగా తిరిగి బయటకు రావాలని కోరారు. బాలల హక్కులు, బాధ్యతలు గురించి చిన్నారులకు సిడబ్ల్యుసి సభ్యులు సూర్యనారాయణ అవగాహన కల్పించారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా చిన్నారులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండా రజని, బి.వి.రామారావు, బాలుర గృహం పర్యవేక్షణాధికారి పి.రమణ, సత్యనారాయణ, డాక్టర్ జీవన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో..



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అతిథులు

ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో జువైనల్ జస్టిస్ బోర్డు మెజిస్ట్రేట్ ఎస్.వరలక్ష్మి, రోటరీ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ వినయ్ గాంధీ, విసివిఐ రిటైర్డ్ ఛీఫ్ మేనేజర్ బి.మణిమాల పాల్గొని బాలల హక్కులు, బాధ్యతలు గురించి వివరించారు. బాలురు సత్‌ప్రవర్తనతో ఉండి పరివర్తన చెందిన మనస్సుతో సమాజంలో అడుగు పెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గృహం పర్యవేక్షణాధికారి ఎం.షణ్ముఖరావు, ప్రభుత్వ బాలుర గృహం పర్యవేక్షణాధికారి అన్నాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) ఆధ్వర్యంలో లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్-14 ఖో ఖో పోటీల్లో ఆనందపురం మండలం సిర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. భీమిలి డివిజన్ తరఫున పోటీల్లో పాల్గొన్న 9వ తరగతి విద్యార్థినులు రేగాని శృతిక, సారిక పవిత్ర, యర్ర హరణి, సిర్ల చైత్ర హర్షిణి ప్రతిభ కనబర్చి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జట్టులో స్థానం సంపాదించారు.

ఇటీవల ఆనందపురం హైస్కూల్‌లో నిర్వహించిన సీనియర్ ఖోఖో విభాగం పోటీల్లో బాలురు విభాగంలో చందక మహేష్, బాలికల విభాగంలో బంటుబిల్లి సుజిన, కొట్ల దీక్షిత, రేగాని శృతిక రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందారు. రగ్బీలో బంటుబిల్లి రేవతి, వాలీబాల్‌లో పాసల శ్యామసుందర్, మారిక వంశీ రాష్ట్రస్థాయి పోటీల్లో విజయనగరం, నెల్లూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో పాల్గొననున్నారు. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్లే విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో రాష్ట్రస్థాయికి చేరుతున్నారని పిఇటి బుత్తల సత్యం, ప్రధానోపాధ్యాయులు శారద తెలిపారు. క్రీడాకారులను ఉపాధ్యాయులు, పాఠశాల చైర్మన్ కోరాడ గౌరి, సర్పంచ్ సిర్ల అప్పలనాయుడు, ఎంపిటిసి సభ్యులు బోని అప్పలనాయుడు, మాజీ చైర్మన్ బుర్లే వెంకటరమణ, అభినందించారు.

మధురవాడ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో జరిగే అండర్ 17, అండర్ 14 కబడ్డీ పోటీలకు చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వెంకటరావు తెలిపారు. అండర్ 17లో పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఎం.మానస బి.లిఖిత బి.చంద్రకళ, అండర్ 14లో ఎన్.శ్రీనివాసరావు, జి.అశోక్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. వీరిని వ్యాయామ ఉపాధ్యాయులు నిరుపమ, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గుదె అచ్యుతరావు అభినందించారు.

ఉచిత దంత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం మండలం లోడగలవానిపాలెం గ్రామంలో సర్పంచ్ లోడగల రాజేశ్వరి, రమణ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 100 మందికి సంగివలస అనిల్ నీరుకొండ డెంటల్ సైన్సెస్ వైద్యులు దంత పరీక్షలు చేశారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్ నీరుకొండ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి వైద్యులు శివ, స్వాతి, సుకన్య, ఎన్.వి.సాయికుమార్, తరుణ్, వరుణ్, భావన, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

దొంగతనం కేసులో వార్డు బాయ్ అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వెంకోజీపాలెంలోని మెడికవర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రోగి మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ చేసిన కేసును ఎంవిపి.పోలీసులు ఛేదించారు. ఆ వివరాలను ద్వారకా క్రైమ్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.చక్రధరరావు గురువారం మీడియాకు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. ఈ నెల 16న రుక్మిణి అనారోగ్యంతో మెడికవర్ హాస్పిటల్‌లో చేరింది. ఆమెకు సహాయకురాలిగా కోడలు సిద్ధాభక్తుల చిన్మయేశ్వరి ఉంది. అదే రోజు రాత్రి పేషెంట్‌ను ఇసిజి రూమ్‌కు తీసుకెళ్లి కొంతసేపటి తరువాత మరలా తిరిగి వార్డుకు తీసుకువచ్చారు. ఆ సమయంలో చిన్మయేశ్వరి గమనించగా పేషెంట్ మెడలో ఉండాల్సిన 28 గ్రాముల బంగారు గొలుసు కనిపించలేదు. ఈ విషయమై 17న ఎంవిపి.పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ టి.రవికుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా హాస్పిటల్ వార్డు బాయ్ సువ్వాన త్రినాథ్ ఈ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. అతన్ని అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు మృతి

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన గుర్తు తెలియని వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని కొక్కిరాపల్లి హైవే వద్ద తుని వైపు నుంచి ఎలమంచిలి వైపు పోవు గురువారం వేకువ జామున సుమారు 3 గంటల సమయంలో రోడ్డు వెంబడి నడిచి వెళ్తున్న గుర్తు తెలియని సుమారు 20 నుండి 30 సంవత్సరాల వయస్సు గల యువకుడ్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆ యువకుడిని 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. కొక్కిరాపల్లి విఆర్ఓ పిల్ల గంగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఉపేంద్ర కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మృతుని వివరాలు ఎవరికైనా తెలిస్తే ఎలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థి అదృశ్యం

ప్రజాశక్తి -గోపాలపట్నం : సింహాచలం దేవస్థానం సంస్కృత ఎయిడెడ్ పాఠశాల పదో తరగతి విద్యార్థి చొక్కాపు మోహనరావు కనిపించడం లేదని తల్లిదండ్రులు గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 18వ తేదీ రాత్రి 8 గంటల నుంచి కనిపించకపోవడంతో హాస్టల్ సిబ్బంది 19వ తేదీన విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్లా వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో గోపాలపట్నం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మోహనరావు ఆచూకీ తెలిసినవారు 7981778151, 7659010291 నెంబర్లకు సమాచారమివ్వాలని పోలీసులు కోరారు.

స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-కొమ్మాది/ మధురవాడ : కొమ్మాది సమీపంలోని దేవిమెట్ట ప్రాంతంలో ఉన్న స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షాప్‌లోని ప్లాస్టిక్ వస్తువులకు నిప్పు అంటుకోవడంతో మంటలు భీకరంగా ఎగసిపడ్డాయి. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు అలుముకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. పిఎం.పాలెం పోలీసులు పరిస్థితిని సమీక్షించారు. ఈ స్క్రాప్ షాప్ దుకాణాన్ని మధురవాడ ప్రియదర్శిని కాలనీకి చెందిన శామ్యూల్ నిర్వహిస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కొమ్మాది: జివిఎంసి 5వ వార్డు పరిధిలో సుమారు రూ.12 కోట్ల అంచనాతో ప్రతిపాదించిన పలు అభివృద్ధి పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం సాయిరాం కాలనీలో శంకుస్థాపన చేశారు. వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, వార్డు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భూగర్భ డ్రైనేజ్ ప్రాజెక్టులు, వర్కులు, మంచినీటి పైపులైన్లు, కాలువలు, సిసి రోడ్లు, మారికవలసలో బ్రిడ్జి పనులు చేయనున్నట్లు చెప్పారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు, వాండ్రాశి అప్పలరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో గీతం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహించిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో గీతం విద్యార్థులు విశాఖ జట్టు తరపున పాల్గొని ప్రతిభను చాటారు. ఈ పోటీలలో పురుషులు సింగిల్స్ విభాగంలో గీతం విద్యార్థులు కుశాల్ దాస్, సూర్య, రోహిత్ హల్‌దర్ ప్రతిభను కనబరిచి పతకాలు అందుకున్నారు. మహిళల సింగిల్స్ విభాగంలో పి.హసని కాంస్య పతకం సాధించారు. విజేతలకు గీతం విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, శాప్ డైరక్టర్ ఎమ్‌డి రమేష్‌కుమార్, జివిఎమ్‌సి స్పోర్ట్స్ డైరక్టర్ ఇ.అప్పలరాజు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గీతం అసిస్టెంట్ డీన్ అరుణ్‌కార్తిక్, ఎపి టేబుల్ టెన్నిస్ సంఘం సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాస్, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డివిఎస్‌వై.శర్మ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వ్రిందా వైద్యులు

చిన్నారి కేన్సర్‌కు 'వ్రిందా' ఉచిత చికిత్స

ప్రజాశక్తి - ఆరిలోవ : రోజు కూలి చేసుకుంటూ జీవితాన్ని నెట్టుకొస్తున్న గిరిజన కుటుంబంలో ఓ చిన్నారి కేన్సర్ బారిన పడటంతో ఆమెకు వ్రిందా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వంశీధర్ పుట్రేపు ఉచితంగా శస్త్రచికిత్స చేశారు. ఆరిలోవ హెల్త్‌సిటీ వ్రిందా ఆసుపత్రిలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో శస్త్రచికిత్స వివరాలను డాక్టర్ వంశీధర్ పుట్రేపు వెల్లడించారు. అల్లూరి జిల్లా పాడేరుకు చెందిన 11 ఏళ్ల గిరిజన బాలిక ధనలక్ష్మి నాలుకకు సార్కోమా కేన్సర్ సోకిందని, దీంతో ఆమె కనీసం మంచినీరు కూడా తాగడానికి వీలుకాని స్థితిలో ఆసుపత్రికి వచ్చిందని తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం ఆమెకు శస్త్రచికిత్స అవసరమని గుర్తించి విజయవంతంగా చేసినట్టు వివరించారు. ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో ఈ శస్త్రచికిత్సను ఉచితంగా చేసినట్టు చెప్పారు. వ్రిందా ఆసుపత్రి వైద్యులు సుమారు 7 గంటలు శ్రమించి ఆమె చేతి నుంచి తీసిన చర్మాన్ని నాలుకగా మలిచి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామన్నారు. గతంలో కూడా పూర్తిగా తెగిపోయిన నాలుకకు విమ్స్‌లో డాక్టర్ వంశీ పుట్రేపు శస్త్రచికిత్స చేసి అతికించిన ఘనత ఉంది.



కాపులుప్పాడలో పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్ అందజేస్తున్న మాజీ సర్పంచ్ బంగారురెడ్డి తదితరులు

పారిశుధ్య సిబ్బందికి యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి- యంత్రాంగం

జివిఎంసి పారిశుధ్య సిబ్బందికి యూనీఫామ్‌ను పలుచోట్ల గురువారం అందించారు.

ములగాడ : జివిఎంసి 59వ వార్డు పరిధి పారిశుధ్య కార్మికులకు వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేష్ ద్వారా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు ఊరుకుటి హరి, నాయకులు డొంకనా రాంబాబు, రామ్ మోహన్ నాయుడు, రామకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి 4వ వార్డు పరిధి కాపులుప్పాడ సచివాలయం వద్ద పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోర బంగారురెడ్డి, టిడిపి నాయకులు దుంప నరసింహ మూర్తి, శీరపు రమణ, నారు ఎల్లాజీ, సచివాలయ ఉద్యోగులు, పాల్గొన్నారు.

సమస్యలపై మేయర్‌కు వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధిలో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మేయర్ పీలా శ్రీనివాసరావుకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు గురువారం మేయర్ ఛాంబర్‌లో వినతి పత్రం అందజేశారు. రెల్లివీధిలో సామాజిక మరుగుదొడ్లు నిర్మించాలని, శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఎగువపేట, గొల్లవీధి, నేరెళ్లవలస కాలనీ, తోట వీధి, అప్పికొండ వీధిలో సిమెంట్ రోడ్లు, కాల్వలు నిర్మించాలని కోరారు.

పర్యాటకులకు ఆతిథ్యమిస్తున్న రెస్టారెంట్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రకృతిసిద్ధమైన అందాలకు నెలవైన భీమిలి ఆతిథ్యరంగంలో దూసుకుపోతోంది. పర్యాటకులకు ఆతిథ్యమిచ్చేందుకు పలు హోటళ్లు, రెస్టారెంట్లు స్వాగతిస్తున్నాయి. వీటిల్లో ఎర్రమట్టి దిబ్బలు ఎదురుగా సాగర తీరంలో విశాలమైన ప్రాంతంలో మార్లిన్ కె హోటల్ ఏర్పాటై ఉంది. పుట్టిన రోజు, వివాహ వేడుకలు, అనేక కార్పొరేట్ ఈవెంట్స్ నిర్వహణకు ఈ హోటల్ చక్కని వేదికగా నిలుస్తోంది. మార్లిన్ కె హోటల్ ప్రాంతం ఆహ్లాదకరమైన వాతావరణం సంతరించుకుని ఉంది. ఎర్ర మట్టి దిబ్బలు ఎదురుగా ఉండడంతో ఈ ప్రాంతం చక్కని అనుభూతులకు నెలవుగా ఉందని పలువురు పర్యాటకులు, సందర్శకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మార్లిన్ కె హోటల్‌కు అనుబంధంగా చక్కని కాఫీ అందించే షాపు ఉంది. సాగరాన్ని కెమెరాల్లో బంధించేలా సందర్శకులు, పర్యాటకులు ఫొటోలు తీసుకునేందుకు వీలుగాకాఫీ షాప్‌పైన సౌకర్యం కలిగి ఉంది .

త్వరలో వసతి సదుపాయం..

గత నాలుగేళ్లుగా పర్యాటక శాఖ సహకారంతో దిన దినాభివృద్ధి చెందుతున్న ఈ హోటల్‌లో రుచి, శుచికరమైన భోజన సదుపాయం కల్పిస్తూ పర్యాటకుల, సందర్శకుల ఆదరాభిమానాలు పొందుతున్నట్టు మార్లిన్ కె హోటల్ యజమాని కిషోర్ చిన్నం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి తెలిపారు. త్వరలో పర్యాటకుల అభిరుచి మేరకు తమ హోటల్‌లో ఆధునికంగా వసతి సదుపాయం కూడా కల్పించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు సంబంధిత అధికారుల నుంచి అన్ని అనుమతులు లభించాయని వివరించారు.



ఆధునిక సదుపాయాలతో ఉన్న మార్లిన్ కె హోటల్

గృహ నిర్మాణ ఆమోదపత్రాల పంపిణీ



గృహ నిర్మాణ ఆమోదపత్రాల పంపిణీచేస్తున్న ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి-సీతమ్మధార : పధానమంత్రి ఆవాస్ యోజన - అర్బన్ 2.0 పథకం కింద ఉత్తర నియోజకవర్గానికి చెందిన 80 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల విలువైన గృహ నిర్మాణ ఆమోదపత్రాలను అక్కయ్యపాలెంలోని షాదీఖానా కల్యాణమండపంలో గురువారం విశాఖ ఎంపీ శ్రీభరత్ పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పేదవాడికీ ఇల్లు కచ్చితంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష కలిపి రూ.2.50 లక్షలు ఒక్కో లబ్ధిదారునికి నాలుగు దఫాలుగా అందజేయనున్నట్లు తెలిపారు. ఎవరికైనా సొంత స్థలం గానీ, పట్టా పొందిన స్థలం ఉంటే ఈ పథకానికి అర్హులని చెప్పారు. ఈ పథకం కావలసినవారు ఎమ్మెల్యే ఆఫీసులో కానీ ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులను కానీ సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఇల్లు నిర్మాణ ప్రక్రియలో లబ్ధిదారులను ఎవరు ఇబ్బంది పెట్టినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎక్కువ మంది ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు ప్రజలను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సత్తిబాబు, డిఇ ప్రసాదరావు, ఎఇ ప్రభ, నార్త్ ఆఫీస్ ఇన్‌ఛార్జి శ్యామల దీపిక, కోయలడ వెంకటేష్ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వెల్లంకి హైస్కూల్‌కు మైక్రోస్కోప్ వితరణ

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం మండలం వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ల్యాబ్ కోసం రూ.19 వేలు విలువైన అత్యాధునిక మోడల్ మైక్రోస్కోప్‌ను రోటరీ క్లబ్ ప్రెసిడెంట్, గవర్నర్ బాబ్జాన్ ఆల్తిఫ్, సతీమణి ఆల్తిఫ్ విరాళంగా అందించారు. గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులకు వారు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దాడిశెట్టి రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు ఇజ్రాయిల్ రోమర్, మారుతి గణేష్, సూర్యనారాయణ పాల్గొన్నారు. పాఠశాలను రోటరీ క్లబ్ దత్తత చేసుకుని ఇప్పటి వరకు పలు సౌకర్యాలు కల్పించిందని ప్రధానోపాధ్యాయులు రమేష్ కుమార్ తెలిపారు. రోటరీ ప్రెసిడెంట్, గవర్నర్ తదితర సభ్యులకు పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు.



పాఠశాలలో మైక్రోస్కోప్ అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి ప్రశాంత్‌నగర్‌లో శ్రీషిర్డీసాయి బాబా ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం సుమారు 2000 మందికి అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎం.హనుమంతరావు, కె.కామేశ్వరరావు, జివి.మధుసూదనరావు, జి.నాగరాజు, ఎం.శ్రీనివాస్, చందు.సుబ్బారావు, డిఎన్.శ్రవణ్ కుమార్, సిహెచ్‌ఆర్‌వి ప్రసాద్, వేణుగోపాల్, ఎం.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'అనంతుని' హుండీ లెక్కింపు

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభంలో ఉన్న అనంత పద్మనాభ స్వామి ఆలయం హుండీ ద్వారా రూ.6.50 లక్షలు ఆదాయం వచ్చిట్లు దేవస్థానం ఈవో నరసింహారాజు గురువారం తెలిపారు. ఏటా మాదిరిగానే దీపోత్సవం మరుచటి రోజు హుండీ లెక్కింపు చేపట్టామని పేర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబరు 19 నుండి నవంబర్ 19వ తేదీ వరకు వచ్చిన హుండీ ఆదాయం రూ.4,11,660 కాగా దీపోత్సవం రోజున అనంత పద్మనాభ స్వామి, కొండ దిగువ ఉన్న కుంతీ మాధవస్వామి, శివాలయంలో కలిపి రూ.2,37,360 ఆదాయం వచ్చినట్లు వివరించారు. దీపోత్సవానికి 13 హుండీలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. దీపోత్సవం ప్రశాంతంగా జరిగిందని, సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి- యంత్రాంగం

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యాన పలుచోట్ల గురువారం సంతకాల సేకరణ చేపట్టారు.

సీతమ్మధార: వైసిపి యువజన విభాగం జోనల్ ప్రెసిడెంట్ అంబటి శైలేష్ ఆధ్వర్యాన ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలో సంతకాల సేకరణ చేపట్టారు. వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు ముఖ్య అతిథిగా పాల్గొని సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆధ్వర్యాన వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి మెడికల్ కాలేజీలను ఏర్పాటుచేస్తే కూటమి ప్రభుత్వ వచ్చాక పిపిపి పద్ధతిలో ప్రయివేటీకరణకు అప్పగించే కుట్రలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అల్లు శంకరరావు, మువ్వల సంతోష్, దీరజ్ పాల్గొన్నారు.


భీమునిపట్నం : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ జివిఎంసి మూడో వార్డులో వైసిపి భీమిలి నియోజకవర్గ సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరి సహస్ర, స్థానిక పార్టీ నాయకులతో కలిసి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.ఎల్లాజీ, ప్రభాకర్ నాయుడు, వి.జగ్గారావు పాల్గొన్నారు

తగరపువలస : జివిఎంసి 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నమ్మి వానిపేటలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్కరమాని మంగరాజు, నమ్మి మాధవరావు, జీరు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అనకాపల్లి : వైద్య కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాలు సేకరణలో భాగంగా అనకాపల్లిలో ఆ పార్టీ నాయకులు గురువారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మలసాల భరత్‌కుమార్, మాజీ ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి మాట్లాడుతూ రూ.8480 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 17 కొత్త మెడికల్ కళాశాలలు జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేసేందుకు కృషి చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి కళాశాలలను ఆపేందుకు కుట్ర చేస్తుందని, ఈ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు పూనుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, బొడ్డేడ ప్రసాద్, మందపాటి జానీ, పెద్దిశెట్టి గోవింద్, కొణతాల మురళీకృష్ణ, కలగా గున్నయ్య నాయుడు, జాజుల రమేష్, కేయం నాయుడు, రమేష్ గుప్తా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు



ఎంపికైన విద్యార్థులతో సన్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు

పర్యాటక రంగంలో విస్తారమైన అవకాశాలు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : టూరిజం రంగానికి ప్రపంచవ్యాప్తంగా విశేష గుర్తింపు ఉందని, కష్టపడి ప్రయత్నిస్తే ఈ రంగంలో విదేశాల్లో సైతం మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రముఖ పారిశ్రామికవేత్తలు మార్క్ స్టెర్నజల్, జిడిఎన్ పాకియనాథన్, డేవిడ్ కసర్ అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రపంచ పర్యాటక రంగంలో అనేక ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. సన్ క్యాంపస్‌లో సన్ ఇంటర్నేషనల్, గ్రాండ్ హయత్ సంయుక్త ఆధ్వర్యంలో దేశ, విదేశాల్లోని టూరిజం రంగంలో ఉపాధి అవకాశాలపై 'క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ ఫర్ జే1 వీసా' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అంకితభావంతో లక్ష్యాలను చేరుకోగలిగితే భవిష్యత్తు మొత్తం ఆనందంగా ఉంటుందన్నారు. సన్ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తి మాట్లాడుతూ విశాఖపట్నంలోని సన్ విద్యార్థులు దేశంలోనూ, ప్రపంచంలోని వివిధ దేశాల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌లో మొత్తం 130 మంది విద్యార్థులు పాల్గొనగా, వారిలో 60 మంది ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యారని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన టూరిజం రంగ ప్రతినిధులు, సన్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి అభిషేకం


ప్రజాశక్తి-మునగపాక : అన్నదాత సుఖీభవ రెండో విడత విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు చెరకు రసంతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే రైతుకు నిజమైన భరోసా కలిగిందని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు భీమరశెట్టి శ్రీనివాసరావు, డొక్కా నాగభూషణం, బిలా స్రవంతి, విల్లూరి నూకనరసింగరావు, దాడి శివ, దొడ్డి రమేష్, సూరిశెట్టి అప్పలనాయుడు, ఎస్.జగ్గ అప్పారావు, ఉల్లింగల గోవింద, కాండ్రేగుల శంకర్, దాడి గంగాజీ, దొడ్డి కృష్ణ, లాలం రమేష్ పాల్గొన్నారు.

టిడిపి ఎస్‌సి సెల్ సభ్యులకు సత్కారం

ప్రజాశక్తి-కశింకోట : టీడీపీ ఎస్సీ సెల్ మండల కమిటీ నాయకులను టీడీపీ మండల అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు గురువారం సత్కరించారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చెవ్వేటి నాగరాజు, మాజీ ఎంపీటీసీ ముప్పిడి అప్పారావు, కొల్లి అప్పారావు, తెరపల్లి శ్రీను, పిల్లి ఆనంద్ కుమార్, చెవ్వేటి అప్పలరాజు, నేతాల చిన్నబాబు, పిల్లి సుందరరావు, గొంది పోతురాజు, పిల్లి శ్రీను తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఉల్లింగల రమేష్, టిడిపి నాయకులు నైనం శెట్టి రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యాన విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-కసింకోట : బాలల దినోత్సవంలో భాగంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో కశింకోటలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి గురువారం బహుమతులు ప్రదానం చేశారు. మ్యూజికల్ చైర్, స్పూన్ బాల్ పోటీలు సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహించి గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను, పాల్గొన్న విద్యార్థులందరకీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి.వరలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యురాలు ఎం.తారక, ప్రజా సంఘాల నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, టి.ఈశ్వరరావు, టి.నూకరత్నం, ఉపాధ్యాయురాలు తులసి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఐద్వా నాయకులు

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

జాయింట్ కలెక్టర్ జాహ్నవి



సమావేశంలో పాల్గొన్న జెసి జాహ్నవి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో వరికోతలు ప్రారంభమైనందున రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఎమ్.జాహ్నవి తెలిపారు. గురువారం ఆమె తన చాంబర్‌లో పౌర సరఫరాల సంస్థ ఏర్పాటు చేసిన ఖరీఫ్ 2025-26లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న రైస్ మిల్లర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉన్న రైస్ మిల్లర్లు ఈ- బ్యాంక్ గ్యారంటీలను పౌర సరఫరాల శాఖకు వెంటనే సమర్పించాలన్నారు. నాణ్యమైన ధాన్యం సంచులను సిద్ధం చేసుకొని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపించాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల నుంచి ఇండెంట్ అందిన వెంటనే మిల్లర్లు నాణ్యమైన సంచులు మాత్రమే వారికి అందజేయాలన్నారు. రైతుల వద్ద నుండి ధాన్యం సేకరణ సమయంలో రైసు మిల్లర్ల వద్ద ఉన్న మాయిస్చర్ మీటర్లను ఉపయోగించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా జరపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మూర్తి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ పి.జయంతి, రైసు మిల్లర్స్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై వినతులు స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లిలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం అనకాపల్లి నియోజకవర్గ ప్రజలు, కూటమి కార్యకర్తలు నుండి వారి సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించి అతి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

తగరంపూడి గ్రామంలో పర్యటన

మండలంలోని తగరంపూడి గ్రామంలో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ గురువారం పర్యటించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రం, పంచాయతీ ఆఫీస్, అంగన్వాడి కేంద్రాలు, హెల్త్ సబ్ సెంటర్లు, గ్రామంలో రోడ్లు, శారద నది గట్లును పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామంలో వీధి దీపాలకు సోలార్



తగరంపూడిలో ప్రజలతో మాట్లాడుతున్న కొణతాల

విద్యుత్తు వీధి దీపాలు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు గ్రామ ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో డిపిఓ సందీప్, గ్రామ సర్పంచ్ యాదగిరి అప్పారావు, మాజీ జడ్పిటిసి భరత్ బాబు, పంచాయతీరాజ్ డిఇ వేణుగోపాల్, ప్రాజెక్టర్ డీఈ శక్తి కుమారి, తహశీల్దారు ఆనంద్, ఎంపీడీవో ఆశాజ్యోతి, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ముందుకు రావాలి



మాట్లాడుతున్న డిఎస్‌పి విష్ణు స్వరూప్

ప్రజాశక్తి-సబ్బవరం : మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పరవాడ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వల్ల వచ్చే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి పర్యవేక్షణలో, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మార్గదర్శకత్వంలో కొనసాగుతున్న అభ్యుదయ సైకిల్ ర్యాలీ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల విక్రేతలపై ఉక్కుపాదం మోపుతూనే, బాధితులకు మానవతా దక్పథంతో పునరావాసం కల్పించాలన్నారు. అనంతరం మూడు రోడ్లు కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐ జి.రామచంద్రరావు, ఎంపీడీవో పి.పద్మజ, తహశీల్దారు బి.చిన్నికృష్ణ, ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంఈఓలు ఎస్.లక్ష్మణరావు, ఎంజె.రవీంద్రబాబు, గ్రామ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, పోలీసు సిబ్బంది, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

అన్న సమారాధనకు విరాళం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని పరవాడపాలెం గ్రామంలో శ్రీఅభయ ఆంజనేయస్వామి పండగ సందర్భంగా గురువారం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బలిజి మంగ ముసిలి నాయుడు దంపతులు రూ.5వేలు విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెత్త ద్వారా ఆదాయంపై అవగాహన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చే విధంగా సర్పంచ్‌లు గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను వినియోగించుకోవాలని ఈఒపిఆర్‌డి లవరాజు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్‌లకు తడి, పొడి చెత్త ద్వారా ఆదాయంపై అవగాహనా కల్పించారు. కార్యక్రమం లో మండలంలోని సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ట్రాఫిక్ నియమాలు, కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని సిఐ ఎం.వెంకట నారాయణ అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కాలేజ్‌లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ట్రాఫిక్ భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.శేషగిరిరావు, కాలేజ్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



రైవాడ రిజర్వాయర్ వద్ద రికార్డులు పరిశీలిస్తున్న స్వర్ణకుమార్

ట్రిపుల్ ఆర్ నిధులతో చెరువుల అభివృద్ధి

ప్రజాశక్తి-దేవరాపల్లి : ట్రిబుల్ ఆర్ పథకం నిధులు 330 కోట్లతో జిల్లాలోని చెరువులను అభివృద్ధి చేస్తున్నట్లు జలవనరుల శాఖ ఉత్తరాంధ్ర చీఫ్ ఇంజనీర్ కెవిఎన్.స్వర్ణ కుమార్ తెలిపారు. రైవాడ జలాశయాన్నిగురువారం ఆయన పరిశీలించారు. జలశయ సమస్యలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. 1970 నుంచి జలశయం పరిస్థితి అధ్వానంగా ఉందని, ప్రధాన గట్టు పగుళ్లు, 1990 వరదల కారణంగా శిథిలావస్థకు చేరుకున్న ఒళ్ళు కట్ట గురించి అధికారులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డ్రిప్పు పునర్నిర్మాణం కోసం రూ.336 కోట్లు ప్రతిపాదన ఉందని తెలిపారు. పెద్దేరు ఆధునీకరణ పనుల కోసం రూ.84 కోట్లు మంజూరు కాగా, కొంతవరకు పనులు జరిగాయని పేర్కొన్నారు. జైకా నిధులతో 2020 నుంచి 28 వరకు కొనసాగించడం జరిగిందని, ఆధునీకరణ పనులకు ప్రస్తుత రేటు ప్రకారం రూ.43.8 కోట్ల పనులు కొనసాగింపుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు. శాశ్వత నిర్మాణాలు కోసం రూ.42 కోట్లు అవసరమని ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. కార్యక్రమంలో ఈఈ ఏ.త్రినాథం, రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు, డిఈ సత్యం నాయుడు, నీటి సంఘం చైర్మన్ గుల్లేపల్లి మురళీకృష్ణ, ఏఈలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇంటిపన్నుల వసూలు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలోని పలు గ్రామాలలో ఇంటి పన్నులు ఆన్లైన్ ప్రక్రియ ద్వారా వసూలు చేస్తున్నట్లు డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ తెలిపారు. గురువారం ఉదయం చిన ఉప్పలం గ్రామ పంచాయతీ పరిధి పిట్లపాలెం గ్రామంలో ఇంటి పన్నులు వసూలు చేసే కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతీ పంచాయతీలో ఇంటి పన్నులు వసూలు ప్రక్రియ ఆన్లైన్ ద్వారా మాత్రమే జరగాలని పేర్కొన్నారు. ఎవరైనా పంచాయతీ కార్యదర్శులు ఆఫ్‌లైన్‌లో ఇంటి పన్నులు వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటి పన్నులు వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.నాగరాజు, నాగూర్ పాల్గొన్నారు.

74వ సారి రక్తదానం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : సినీ నటుడు చిరంజీవి బ్లడ్ బ్యాంకులో అస్తాపురం ప్రాంతానికి చెందిన చిరు అభిమాని లాలం చందు 74వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చందుకు బ్లడ్ బ్యాంక్ సీఈవో రవణం స్వామి నాయుడు మెమెంటో అందజేశారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పంచకర్ల పర్యటన

ప్రజాశక్తి-పరవాడ : మన గ్రామానికి - మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు గురువారం మండలంలోని కలపాక, భరిణికం, తానాం గ్రామ పంచాయతీలలో పర్యటించారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను నేరుగా తెలుసుకొని, పరిష్కారానికి మార్గం చూపడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన చెప్పారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షునిగా ఇటీవల నియమితులైన కన్నూరు వెంకటరమణను తానాం గ్రామంలో ఎమ్మెల్యే సాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్ నాయుడు, తహశీల్దారు నాగరాజు, జనసేన నేత పంచకర్ల ప్రసాద్‌రావు, మాజీ జెడ్పీటీసీ పైలా జగన్నాథరావు, జనసేన మండల అధ్యక్షులు బొడ్డపు శ్రీనివాసరావు, కూటమి నాయకులు వర్రి పరదేశి నాయుడు, కెఎన్ఆర్, తానాం సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



మా ఊరి వెంకన్న సినిమా బేనర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

మంచి సినిమాలకు ప్రేక్షకాదరణ

ప్రజాశక్తి-మునగపాక : మంచి కథతో నిర్మించిన సినిమాలు ప్రేక్షక ఆదరణ పొంది విజయవంతమవుతాయని జనసేన నాయకులు బొడ్డేడ అప్పలనాయుడు అన్నారు. గ్రామానికి చెందిన శివాలయ అర్చకులు వెలవలపల్లి కోటేశ్వర శర్మ యజ్ఞశ్రీ బ్యానర్ పై నిర్మించిన "మా ఊరి వెంకన్న" సినిమా ఈనెల 14న విడుదలై విజయవంతమైన సందర్భంగా మండల కేంద్రం మునగపాకలో గురువారం సినిమా బ్యానర్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామానికి చెందిన దర్శక, నిర్మాతలు కోరుకొండ గోపికృష్ణ, వెలవలపల్లి కోటేశ్వర శర్మలు గ్రామ కీర్తిని దశదిశల వ్యాప్తి చెందేలా అద్భుతంగా చిత్రాన్ని రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కళాకారులు దాడి ముసలి నాయుడు, వెలగా మురళి, కాంగ్రెస్ గుల గణేష్ పాల్గొన్నారు.

దత్తతపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో 'దత్తత అవగాహన మాసోత్సవాల్లో' భాగంగా గురువారం అనకాపల్లి రైల్వే స్టేషన్లో దత్తతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ పి.లక్ష్మి మాట్లాడుతూ చట్టపరంగా దత్తత ఎలా తీసుకోవాలో వివరించారు. బాలబాలికలకు ఎటువంటి సమస్యలున్నా 1098 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీదేవి, లక్ష్మి, డిసిపియు సిబ్బంది కౌన్సిలర్ భాను, సామాజిక కార్యకర్తలు మంగ, రూప, రమ్య, స్టేషన్ మాస్టర్ కె.రామకృష్ణ పాల్గొన్నారు.




రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి శ్రావణి

పోలీసు స్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఏ.కోడూరు పోలీస్ స్టేషను గురువారం అనకాపల్లి డీఎస్పీ ఎం శ్రావణి వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. అవసరమైన ప్రధాన కూడలి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా అరికట్టడానికి ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సిఐ పైడపునాయుడు, ఎస్ఐ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

'మన డబ్బులు -మన లెక్కలు'పై అవగాహన

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : మండలంలోని కృష్ణాపురం గ్రామంలో వెలుగు సిసి ప్రకాష్, వివఏ లావణ్య ఆధ్వర్యంలో మన డబ్బులు- మన లెక్కలు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని డ్వాక్రా మహిళలతో సమావేశమై అవగాహన కల్పించారు. డ్వాక్రా మహిళలు కట్టే డబ్బులు కచ్చితంగా బ్యాంకులో జమ అవుతుందో లేదో చూసుకోవాల్సిన బాధ్యత, మొత్తం గ్రూప్ సభ్యులు అందరిపైనా ఉందని చెప్పారు. అనంతరం గ్రామంలో డ్వాక్రా మహిళలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొలగని భాస్కర్, డ్వాక్రా మహిళలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న వెలుగు సిసి, విఓఎలు, మహిళలు



పాయకరావుపేట : విజేతలకు బహుమతులు అందించిన దృశ్యం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుచ్చియ్యపేట శాఖా గ్రంథాలయంలో గురువారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జడ్పీటిసి దొండా రాంబాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మెంబర్ సిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, పిఏసిఎస్ అధ్యక్షుడు డి.అప్పలనాయుడు, లైబ్రేరియన్ వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అనకాపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కర్రి సత్యనారాయణ, టిడిపి నేత ఉల్లంగిలి రమేష్, జెడ్పి హైస్కూల్ హెచ్ఎం ఎస్.ప్రసాదరావు, గ్రంథాలయాధికారి కె.జగన్నాథం పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక శాఖ గ్రంథలయంలో వారోత్సవాలు ముగింపు సందర్భంగా వ్యాసరచన, పాటలు, డ్రాయింగ్ వంటి పోటీలలో విజేత విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐపి ప్రసాదరావు, ఎంఈఓ బుద్ధ శివ నాయుడు, లైబ్రేరియన్ కే.వరలక్ష్మి పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన జడ్పీ హైస్కూల్, ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు గురువారం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శాఖ గ్రంథాల అధికారి ఎం.పద్మావతి. హైస్కూల్ హెచ్ఎం జి.వెంకటరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక శాఖా గ్రంథాయంలో వారోత్సవాల ముగింపు సమావేశంలో పలు పాఠశాలల్లో జరిగిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, కొక్కిరాపల్లి ఏపి సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ ఇస్తారు రాణి, రిటైర్డు వైస్ ప్రిన్సిపాల్ పూరీ జగన్నాధం, పౌర సేవా సంఘం అధ్యక్షులు పుల్లా వెంకట్రావు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక శాఖవీధి శాఖా గ్రంథాలయంలో ముగింపు వేడుకల్లో వివిధ పోటీల విజేతలకు జిల్లా ఖజానా శాఖ అధికారి వి.లక్ష్మీసుభాషిణి, శారదా గ్రంథాలయ అధినేత కోరుకొండ బుచ్చిరాజు చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు, ప్రోగ్రామ్ చైర్మన్ బల్లా నాగభూషణం పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఓ పాండురంగారావు, గర్ల్స్ హైస్కూల్ హెచ్ఎం రామయ్య రెడ్డి, ఉపాధ్యాయులు టివి.రమణ, గ్రంథాలయ అధికారి జోగేశ్వరి పాల్గొన్నారు.

కోటవురట్ల : స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాలు ముగింపు సందర్భంగా వారం రోజులుగా నిర్వహిస్తున్న వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు, జడ్పిటిసి ఉమాదేవి, టిడిపి నేత లాలం కాశీనాయుడు, ఎంపీడీవో చంద్రశేఖరు, ఎంఈఓ రామారావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో వారం రోజుల పాటు నిర్వహించిన పోటీలలో విజేత విద్యార్థులకు ఎంపిడిఓ బి.చిన్నారావు, ఎంఇఓ సిఆర్‌కె.దేవరాయలు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎల్వి రమణ, అచ్యుతా విద్యాసంస్థల అధినేత పల్లి శేషగిరిరావు, విశ్రాంత హెచ్ఎం కుసుమకుమారి పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో విజేత విద్యార్థులకు ఎంపీపీ బోకం సూర్యకుమారి, గ్రామ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎంజె రవీంద్రబాబు, గ్రంథాలయ అధికారి వి.శిరీష పాల్గొన్నారు.

పాయకరావుపేట : స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, ఎస్ఐ పురుషోత్తమ్, ఎంఇఓ రమేష్‌బాబు, రిటైర్డ్ లైబ్రేరియన్ మూర్తి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ లైబ్రేరియన్ ఎవివియస్‌యస్‌యన్ మూర్తి, లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా ట్రైనీ ఎస్ఐ సాహిబా అంజుమ్ హాజర య్యారు. బండారు చారిటబుల్ ట్రస్ట్ అధినేత బండారు గోవిందరావు సమకూర్చిన బహుమతులను ఆమె అందజేశారు. నక్కపల్లి గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి గోవిందేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి సర్పంచ్ జయ రత్నకుమారి విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.

మాడుగుల : మాడుగుల, కెజె పురం గ్రంథాలయాలలో గెలుపొందిన వారికి గ్రామ పెద్దలతో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాలు మాడుగుల గ్రంథాలయ అధికారి ఎర్ల వెంకటేశ్వరరావు, కేజే పురం గ్రంథాలయ అటెండర్ వి శృతి ఆధ్వర్యంలో జరిగాయి.

గొలుగొండ : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వరలక్ష్మి ఆధ్వర్యంలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు, ఎంఇఓ సత్యనారాయణ, జోగుంపేట హెచ్ఎం నాగభూషణం, ఏపిఆర్‌డబ్ల్యుఎస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, రావికమతం ఎంఇఓ ఎం.లింగమూర్తి, మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం జి.దాస్ పాల్గొన్నారు.



నర్సీపట్నం : విజేతలతో త్రిమూర్తులురెడ్డి తదితరులు

నర్సీపట్నం : మండల కేంద్రంలో గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి దమయంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పూర్వ గ్రంథాలయ అధికారి త్రిమూర్తుల రెడ్డి, ఎంఈఓ తలుపులు, ప్రధానోపాధ్యాయులు అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బివిఎస్.అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథులుగా ఎంఇఓ-2 కె.గంగరాజు, సర్పంచ్ చందక లక్ష్మి, భీమిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరానికి బెస్ట్ రీడర్ అవార్డును ఎల్.ఉమాశంకర్‌కు ప్రదానం చేశారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు అతిథుల ద్వారా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగటి రాము, శ్రీనాధు నారాయణరావు, కొట్యాడ రెడ్డిబాబు పాల్గొన్నారు.

పెందుర్తి : అడవివరం శాఖా గ్రంథాలయంలో ముగింపు వేడుకలు నిర్వహించారు. సింహాచలం దేవస్థానం సహాయ కార్యనిర్వాహాధికారి బి.వి.రమణమూర్తి, విశ్రాంత సబ్ ఇన్‌స్పెక్టర్ శైలేంద్రబాబు, కార్మిక నాయకులు సిహెచ్‌ఎస్‌ఎన్.రాజు అతిథులుగా హాజరై వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడవివరం శాఖా గ్రంథాలయాధికారి ఎన్‌వి.నరసింహ పాల్గొన్నారు.

పెందుర్తి శాఖా గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమానికి మేయర్ పీలా శ్రీనివాసరావు హాజరయ్యారు. వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను మేయర్ ద్వారా అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, గ్రంథాలయ అభివృద్ధికి సహాయ సహకారాలను అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కె.సోమశేఖరరావు, బి.కుమార్‌రాజు, గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ముగింపు వేడుకలకు ములగాడ ఎంఇఓ ఎల్‌బి.వెంకటరావు హాజరై వివిధ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, మెమోంటోలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో కాకి పోలిరెడ్డి, ఇపిఎస్.భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తగరపువలస : అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ ప్రాముఖ్యతను ప్రిన్సిపల్ డాక్టర్ బి..మురళీకృష్ణ వివరించారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు వారోత్సవాల్లో వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గంటా నూకరాజు, మైలపల్లి లక్ష్మణరావు, టి భీమారావు తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు నియామక పత్రాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-చోడవరం : అసంఘటితర కార్మికులందరికీ నియామక పత్రాలు ఇవ్వాలని చోడవరం సహాయ కార్మిక శాఖాధికారి పి.సూర్యనారాయణ అన్నారు. చోడవరం పాత బస్టాండ్‌లో ఉన్న పెట్రోల్ బంక్‌లో పని పనిచేస్తున్న కార్మికులకు ఆయన యజమాని ద్వారా గురువారం నియామక పత్రాలు అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోడవరం సబ్బవరం, దేవరపల్లి, కె. కోటపాడు, వి.మాడుగుల, రావికమతం, చీడికాడ బుచ్చియ్యపేట మండలాల్లోని దుకాణాల యజమానులు తమ వద్ద పనిచేస్తున్న వారిని గుర్తించి నియామక పత్రాలు ఇవ్వాలని కోరారు. కనీస వేతనం చట్టం ద్వారా వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.



నియామక పత్రాలు చూపుతున్న కార్మికులు

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరపల్లి సబ్ స్టేషన్ నుండి తారువా ఫీడర్ ఆర్డిఎస్ఎస్ వర్క్స్‌లో భాగంగా లైన్ క్లియర్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఏఈ కర్రి శంకర్రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా తెనుగుపూడి, వెంకటరాజపురం, చినగంగవరం, గరిసింగి గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. అలాగే 33 కెవి చీడిపల్లి ఏబి నుండి 33/11 కేవీ తారువా ఎస్ఎస్ వరకు పిఎమ్ఐ వర్క్స్ వల్ల ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు తారువా, మారేపల్లి, పెదనందిపల్లి, వాకపల్లి, తిమిరం, కలిగొట్ల విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

యలమంచిలి టౌన్ : 33/11కెవి నరసింగపల్లి సబ్ స్టేషన్, మెలిపాక ఫీడర్ పరిధిలో గల జంపపాలెం, 33/11కెవి పురుషోత్తపురం సబ్ స్టేషన్/ఫీడర్ పరిధిలో గల రేగుపాలెం గ్రామలలో లైన్ మెయింటనెన్స్ పనులు నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ కె.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల ధర్నా



మాట్లాడుతున్న సిఐటియు నేత రాజు

ప్రజాశక్తి-గొలుగొండ: తమ సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో గురువారం వీఆర్ఏలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 20వేల మంది విఆర్ఎలు రెవిన్యూ డిపార్ట్మెంట్లో పని చేస్తున్నారన్నారు. వీరికి కనీస వేతనాలు అమలు కాలేదని, గతంలో ఇచ్చిన డిఏని వెనక్కి తీసుకోవడం జరిగిందన్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న నామిని వీఆర్ఎలను పర్మినెంట్ చేయలేదని చెప్పారు. అదనపు విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు, అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ నరేంద్ర, డివిజన్ ప్రెసిడెంట్ వి.రమణ, మండల సెక్రెటరీ జీ.లక్ష్మణ్, పెసిడెంట్ వి.నూకరాజు, జ్యోతి, భవాని, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : సమస్యలపై పద్మనాభం తహశీల్దార్ కార్యాలయం ఎదుట విఆర్ఎలు ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సాధు తదితరులు పాల్గొన్నారు.

పొదుపులపై డ్వాక్రా మహిళలు అప్రమత్తం

-ప్రతి నెలా సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళికలు

ప్రజాశక్తి - మాడుగుల: డ్వాక్రా పొదుపు మహిళలకు లక్షలాది రూపాయలు బ్యాంక్ అందించిన రుణ సొమ్మును మండలంలోని కొందరు వెలుగు విఒఎలు కాజేయడంతో గ్రామైక్య సంఘాలకు చెందిన డ్వాక్రా మహిళలు అప్రమత్తమవుతున్నారు. మాడుగుల మండలంలో 1869 డ్వాక్రా సంఘాలకు సంబంధించి 19వేల 4 వందల 51 మంది సభ్యులు ఉన్నారు. ఈ సభ్యులకు సమావేశాలు నిర్వహించి, ఆర్థిక లావాదేవీలు, ప్రభుత్వం అందించే రుణాలు, పావలా వడ్డీ, పథకాలపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించేందుకు 62 మంది వివోఏలు ఉన్నారు. ఒక్కో వివోఏకు సుమారు 30 నుంచి 35 గ్రూపు సభ్యులు ఉంటారు. డ్వాక్రా మహిళలకు అందే రుణాలు, పావలా వడ్డీ, స్త్రీనిధి వంటి పలు రుణాల విషయమై సభ్యులు మినిట్ పుస్తకాలో తీర్మాణాలు, సంతకాలపై వివోఏలు సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారా లేదా అన్న విషయంలో సీసీ, పీపీఎంల పర్యవేక్షణ ఉండాలి. వాస్తవంగా ఏర్పరిచిన గ్రూపులో ఉన్న పది నుంచి 12మంది దాకా మహిళా సభ్యుల్లో సగానికి పైగా మహిళలు స్థానికంగా ఉండలేదని తెలిసింది. దీంతో ఆ సభ్యులు డ్వాక్రా సమావేశాలకు హాజరుకాలేక పోతున్నారు. దీంతో, స్థానికంగా ఉన్న సభ్యులకు వివోఏలే నచ్చచెప్పి మినిట్ పుస్తకాల్లో తీర్మాణాలు చేయిస్తున్న పరిస్థితి నెలకొంది.రుణాలు మంజూరు చేసే సమయంలో ఇతర ప్రాంతాల్లో ఉన్న సభ్యులను రప్పిస్తున్నారు. అందులో కూడా ఒకరిద్దరు లేకపోయినా వివోఏలకు బ్యాంకర్లతో ఉన్న పరిచయాన్ని బట్టీ తీర్మాణాల్లో సంతకాలు చేస్తారు. ఆరోగ్యరీత్యా బాగోలే లేనందున రాలేదని ఆన్లైన్ వీడియో కాల్ ద్వారా మాట్లాడించి రుణాలు మంజూరు చేయిస్తున్నారు.పట్టణ ప్రాంతాల్లో ఉంటున్న మహిళలను డ్వాక్రా గ్రూపుల్లో చేర్పించడంతో స్థానికంగా ఉన్న అసలైన సభ్యులు నష్టపోతున్నారు.

మాడుగుల మండలం అవురువాడ పంచాయతీ ఏ.వీరనారాయణం, తుమ్మవానిపాలెం గ్రామాలకు చెందిన 43 గ్రామైక్య సంఘాలు నడుపుతూ, అక్కడ మహిళలను ఇదేమాదిరిగా నమ్మించి 50లక్షలకు టోపి వేశారు.

ఈ విషయాన్ని తెలుసుకున్న ప్రస్తుత డ్వాక్రా మహిళలు ఆయా వివోఏల దగ్గర ఉన్న మినిట్ పుస్తకాలు తీసుకొని తనిఖీ చేయించు కుంటున్నారు. స్థానికంగా లేకుండా డ్వాక్రా గ్రూపులో చలామణి అవుతూ రుణాలు పొంది సమావేశాలను ఎగ్గొడుతున్న వారి వివరాలు అదికారులకు ఇచ్చేందుకు వివోఏలు సన్నద్ధమవుతున్నారు. ఈ మోసాలను దృష్టిలో పెట్టుకొని మన డబ్బులు- లెక్కలు యాప్ ద్వారా రుణాలు తీసుకున్న మహిళలు స్వయంగా సమావేశాలకు హాజరైన సమయాలో ఆన్లైన్లో చెల్లించే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.

స్వమిత్వ గ్రామ సభలు

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండలంలోని గుడివాడ, కర్రివానిపాలెం, పిట్లపాలెం, గ్రామాలలో గురువారం స్వమిత్వ గ్రామసభలు నిర్వహించినట్టు డిప్యూటీ ఎంపిడిఓ బంగారి సత్యనారాయణ తెలిపారు. ప్రతీ ఇంటి కొలతలు శాస్త్రీయంగా తీసి ఇంటి యాజమాన్యం హక్కుల పత్రం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇంటి కొలతలలో ఏమైనా లోపాలు ఉంటే ఈ గ్రామ సభలలో ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు. మండలంలోని రామయ్యపట్నం, చిన గుమ్ములూరు గ్రామ పంచాయతీలలో అమలు జరుగుతున్న డోర్ టు డోర్ శానిటేషన్ కార్యక్రమాలను ఎంపిడిఓ పి.మీనా కుమారి పరిశీలించారు. కార్యక్రమంలో గుడివాడ సర్పంచ్ ధూళి శ్రీనుబాబు, ఉప సర్పంచ్ రామకృష్ణ రాజు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

రబీ డ్రై సోయింగ్ విత్తనాలపై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో జి.భీమవరం గ్రామంలో రబీ డ్రై సోయింగ్ విత్తనాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సిహెచ్.లచ్చన్న మాట్లాడుతూ రైతులు వేసుకునే ప్రధాన పంటతో పాటు ఐదు రకాల నుండి తొమ్మిది రకాలు విత్తనాలు రెడీ చేసుకునివచ్చని తెలిపారు. కిట్లు 333 తయారు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం గోవింద్, ఎన్ఎఫ్ఎ రామ గోవింద, పంచాయతీ కార్యదర్శి అభిషేక్, మండల నోడల్ పర్సన్ ద్వారపూడి రమణ, కె.అరుణ, ద్వారపూడి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్డిఎ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ గురువారం నిర్వహించిన క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా విఎంఆర్డిఎ ఆధ్వర్యంలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానించేందుకు సుమారు 175 కోట్ల రూపాయల ఖర్చుతో 26.72 కిలోమీటర్ల పొడుగున నిర్మించతలపెట్టిన ఏడు ప్రధాన బృహత్తర ప్రణాళిక రహదారులను గురువారం పరిశీలించారు. అడ్డంకులు, అవరోధాలు లేని ప్రాంతాల్లో పనులను వేగవంతం చేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, ముఖ్య ప్రణాళికాధికారిణి శిల్ప, పర్యవేక్షక ఇంజినీర్ మధుసూదనరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ రామరాజు, ఉప కార్యనిర్వహక ఇంజినీర్లు విశ్వనాథ్, రవిశంకర్, సహాయక ఇంజనీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




విశాఖ బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

విశాఖ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : వచ్చేనెల 9 నుండి 11 వరకూ సెయింట్ ఆంథోనీ ఓల్డ్ తెలుగు ప్రైమరీ స్కూల్లో నిర్వహించే మూడవ మెగా చిల్డ్రన్స్ ఫెస్టివల్, విశాఖ బాలోత్సవం పోస్టర్‌ను గురువారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎంఎన్ .హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలోత్సవం అధ్యక్షులు పి.రఘు, ప్రధానకార్యదర్శి జి.ఎస్. రాజేశ్వరరావు, కోశాధికారి సిహెచ్ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు బుజ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి రాజేశ్వరరావు మాట్లాడుతూ, విశాఖ వ్యాలీ రోటరీతో కలిసి ఈసారి బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్, జివిఎంసి కమిషనర్, డిఇఒతో బాటు నగరంలోని 56 మంది ప్రముఖులతో ఆహ్వానసంఘాన్ని ఏర్పాటు చేసామన్నారు. బాలోత్సవం బుక్‌లెట్స్‌ను పాఠశాలలకు వెళ్లి కార్యకర్తలు అందిస్తున్నారన్నారు. గతేడాది బాలోత్సవంలో 8 వేల మంది పిల్లలు పాల్గొనగా, ఈ ఏడాది అంతకుమించి పాల్గొనే అవకాశం ఉందన్నారు. 9న ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా రావాలన్న ఆహ్వానానికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు.

డావిన్సీలో తరగతులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : డావిన్సీ ఇంటర్నేషనల్ స్కూల్లో విద్యార్థులకు తరగతులను యథావిధిగా కొనసాగించాలని పిల్లల తల్లిదండ్రులు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ ఈనెల 13న జరిగిన సంఘటన కారణంగా స్కూల్లో పాఠాలు బోధించడం లేదన్నారు. ఆన్లైన్‌లో తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆన్లైన్లో తరగతిలో బోధించడం వలన విద్యార్థులకు సరైన విధంగా అర్థం చేసుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. స్కూల్లో చదివే 600 మంది విద్యార్థులకు నేరుగా స్కూల్లోనే ఉపాధ్యాయులతో తరగతులు బోధించే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ తరగతుల విద్యార్థులకు పరీక్షలో దగ్గర పడుతున్న కారణంగా ప్రభుత్వ అధికారులు విద్యార్థులు తల్లిదండ్రుల సమస్యను అర్థం చేసుకొని న్యాయం చేయాలని కోరారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఘనంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి వైసిపి క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాలుగు మండలాలకు చెందిన వైసిపి మండల పార్టీ అధ్యక్షులతో పాటు కోటవురట్ల వైసిపి నాయకులు, కార్యకర్తల నాయకుల సమక్షంలో కేకు కట్ చేశారు. వైసిపి శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఎంపీటీసీ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు అనుబంధ సంస్థల నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

68వ రోజుకు మత్స్యకారుల రిలే దీక్షలు

ప్రజాశక్తి-నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేసారు.మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు బుధవారం నాటికి 68వ రోజుకు చేరింది. బల్క్‌డ్రగ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి మత్స్యకారుల జీవితాలతో చెలగాటం ఆడొద్దన్నారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ జీవితాలు బుగ్గిపాలు అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే హెటిరో కంపెనీ వ్యర్థ రసాయన జలాలు సముద్రంలో కలవడంతో మత్స్య సంపద ఉత్పత్తి తగ్గడంతో రోడ్డును పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ప్రాంతంలో వేట సాగకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కంపెనీ కాలుష్యంతో అనేక రకాల ప్రాణాంతకరమైన వ్యాధుల బారినపడి అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇటువంటి నేపథ్యంలో బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ జీవన విధానం, ఉనికికి ముప్పు వాటిల్లే పరిస్థితి నెల కొందన్నారు. ప్రభుత్వం స్పందించి బల్క్ డ్రగ్ ను రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు బి.బాబ్జి, సోము, కాశీ, సోమేష్, నూకరాజు, చొక్కా కాశీ, నూకమ్మ, సత్తెమ్మ, చిట్టమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమవరం చెక్ పోస్టు వద్ద నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అంతాడ, బంగారమ్మపేట, రంపుల ఘాట్ రోడ్డు నుండి గంజాయి అక్రమ రవాణాపై డ్రోన్ ద్వారా ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, గంజాయి రవాణా చేసినా, శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎస్సై పి.రామారావు పాల్గొన్నారు.


కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న స్పీకర్


స్పీకర్ అయ్యన్నతో కంపెనీ ప్రతినిధుల భేటీ

ప్రజాశక్తి-నర్సీపట్నం:మాకవరపాలెం మండలంలో ఏర్పాటు కానున్న భారీ ఎర్త్ మూవింగ్ పరికరాల విడిభాగాల తయారు కంపెనీ ప్రతినిధులు గురువారం రాష్ట్ర సభాపతి స్పీకర్ అయ్యన్నపాత్రుడును కలిశారు. మాకవరపాలెం మండలంలో రాచపల్లి గ్రామం వద్ద 100 ఎకరాల విస్తీర్ణంలో1234 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న కంపెనీ ప్రతినిధులు, జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, ఏజీఎం రామారావు స్పీకర్ అయ్యన్న తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, నర్సీపట్నం నియోజకవర్గ మాకవరపాలెం మండలం పరిశ్రమల హబ్‌గా మారనున్న తరుణంలో ఈ ప్రాంత ప్రజలకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పన జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- నక్కపల్లి:రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు నక్కపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు పి విజయ గురువారం తెలిపారు. జిల్లాస్థాయి హాకీ పోటీల్లో విద్యార్థులు నాగ తనూజ్, పి.రాకేష్, విశాల్ లు ప్రతిభ కనబరచడంతో ఈనెల 22వ తేదీ నుండి తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలియజేశారు. అండర్ -17 విభాగంలో విశాఖపట్నం పోర్ట్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు ఎం దిలీప్, కె.నాగ తరుణ్, కె.గణేష్, బి.నగేష్ ప్రభు కుమార్, పి.రోహిత్‌లు ప్రతిభ కనబరచడంతో ఈనెల 27 నుండి వైఎస్ఆర్ జిల్లా పులి వెందులలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం విజయ తో పాటు పీడీలు నీరజ, ధనలక్ష్మి, ఉపాధ్యాయులు టివి రమణ, డి.శ్రీనివాస్, పి.వరలక్ష్మి, పి.శ్రీనివాస్ లు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు.


వివరాలు తెలుసుకుంటున్న తహశీల్దార్

ఎఫ్ఎంసికి

కుటుంబ సభ్యుల అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-నర్సీపట్నం:ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకునేందుకు కుటుంబ సభ్యుల పూర్తి సమ్మతి తీసుకోవాలని తహసిల్దార్ రామారావు సూచించారు. బలిఘట్టం గ్రామానికి చెందిన శెట్టి మాణిక్యం ఇటీవల చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం భార్య నూకాలమ్మ కుమార్తె దరఖాస్తు చేశారు. మృతుడికి భార్య కుమార్తె కుమారుడు కూడా ఉండడంతో కుటుంబ సభ్యుల అనుమతితోనే ధ్రువపత్రం మంజూరు చేయాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని గ్రామ రెవెన్యూ అధికారి డివి లక్ష్మికి సూచించారు.

బిఎన్ రోడ్డుపై కూరుకుపోయిన లారీ

- గొయ్యిలు పూడ్చాలని సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి-రోలుగుంట:మండల కేంద్రంలోని ప్రైవేటు హాస్పిటల్ వద్ద గురువారం ఉదయం లారీ గొయ్యిలో కూలి పోయింది. దీంతో, సిపిఎం ఆధ్వర్యంలో బిఎన్ రోడ్డుపై గొయ్యిలు వెంటనే పోడ్చాలని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగానాద సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు, నాయకులు పాంగి చంద్రయ్య మాట్లాడుతూ, ఎంపీ, ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీ అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రయాణికులు గొయ్యిల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. నిండు గర్భిణీలు 108 వాహనంలో ప్రయాణం చేయాలంటే ఈ రోడ్డుపై అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే, ఎంపీ స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గెమ్మెలి వాసు, గ్రామస్తులు, వాహనదారులు, తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

సిఐటియుకు కెమెరాల బహూకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకూ విశాఖలో సిఐటియు అఖిల భారత మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో మహాసభల సోషల్ మీడియా ప్రచార క్యాంపెయిన్ కోసం స్టీల్‌ప్లాంట్ విశ్రాంతి ఉద్యోగి, సిపిఎం జోన్ పూర్వ కార్యదర్శి డిసిహెచ్.వెంకటేశ్వరరావు విలువైన మూడు రకాల డిజిటల్ కెమెరాలను బహుమతిగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావుకు అందజేశారు. మహాసభల విజయవంతం కోసం ఏర్పాటు చేసిన సోషల్ మీడియా విభాగం సమావేశం గురువారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ విశాఖలో జరగబోతున్న మహాసభల జయప్రదం కోసం ఇప్పటికే విశాఖ సోషల్ మీడియా టీం మంచి కృషి చేస్తోందన్నారు. టీం సభ్యులుగా డిసిహెచ్.వెంకటేశ్వరరావు చురుకైన పాత్ర పోషించడంతో పాటు సోషల్ మీడియాకు అత్యంత ప్రాధాన్యత కలిగిన కెమెరాలను బహూకరణ చేయడం ఆనందదాయకమన్నారు. ఆయనకు సంఘం రాష్ట్ర కమిటీ తరుపున, మహాసభల ఆహ్వాన సంఘం తరుపున ధన్యవాదాలు తెలియజేసారు. కార్యక్రమంలో కారసాల శ్రీనివాస్, పవన్, అరుణ్, సుజాత, వి.కృష్ణారావు, బి.జగన్, కనకరాజు పాల్గొన్నారు.


కెమెరాలను బహూకరిస్తున్న డిసిహెచ్.వెంకటేశ్వరరావు

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ కస్తూరిబా బాలికల పాఠశాల ఒకేషనల్ కాలేజీలో విద్యార్థినులకు నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, గొలుగొండ ఎస్సై పి.రామారావు గురువారం చట్టాలపై అవగాహన కల్పించారు.కొత్త చట్టాలు, మహిళలపై నేరాలు, ఫోక్సో కేసులు, బాల్య వివాహాలతో ప్రమాదాలు వంటి వాటిపై వివరణాత్మకంగా తెలియజేశారు. విద్యార్థినులకు సమస్యలు ఎదురైతే పోలీసుల సహాయం ఎలా పొందాలనే విషయంపై కూడా మార్గదర్శకాలు ఇచ్చారు.


మాట్లాడుతున్న సిఐ రేవతమ్మ

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు పిలుపునిచ్చారు. స్థానిక ఎస్ఈజెడ్ కార్మికులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. సామాజిక భద్రత సౌకర్యాలు లేక కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్తు రంగంలో బ్యాంకింగ్ తదితర ప్రభుత్వ సంస్థలలో ప్రైవేటీకరణ విధానాలను అత్యంత వేగంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్మిక చట్టాలలో సవరణలు చేసి లేబర్ కోడ్లను ప్రవేశపెట్టడం వలన కార్మికులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలపై అఖిల భారత మహాసభల్లో చర్చించి కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని చెప్పారు. సిఐటియు జాతీయ మహాసభలు రాష్ట్రంలో మొదటి సారి జరుగుతున్నాయని, విశాఖలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలకు 22 రాష్ట్రాల నుండి 200 మంది ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. జనవరి 4న లక్ష మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశామని, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.రాము కార్మిక సంఘం ప్రతినిధి ఎస్.రాము, తాతారావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

నెల రోజుల్లో నిర్మాణాలు పూర్తి చేస్తాం

ప్రజాశక్తి-యలమంచిలి : స్థానిక రైల్వే స్టేషన్‌లోని 1, 2 ప్లాట్ ఫారాల్లో కొత్తగా చేపట్టిన షెడ్స్ (పైకప్పులు) నిర్మాణాన్ని నెల రోజుల్లో పూర్తి చేస్తామని విజయవాడకు చెందిన ఎంవి కనస్ట్రక్షన్స్ ప్రతినిధి రామ్మోహన్ అన్నారు. అమృత పథకంలో ఎంపికైన యలమంచిలి రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు ఆలస్యంగా జరుగుతుండం పట్ల రామమోహన్‌ను ప్రజాశక్తి గురువారం కలిసి వివరణ కోరింది. దీనికి స్పందించిన ఆయన మాట్లాడుతూ విజయవాడ నుండి దువ్వాడ స్టేషన్ల మధ్య గల అనేక స్టేషన్లలో వర్షాలకు, ఎండలకు ప్రయాణికులకు రక్షణ కల్పించే సెల్టర్ షెడ్స్ నిర్మించే అవకాశం తమ సంస్థకు దక్కిందని, చాలా స్టేషన్లలో ఒకేసారి పనులు మొదలు పెట్టడంతో కొన్ని చోట్ల కాస్త ఆలస్యమైందని తెలిపారు. యలమంచిలి రైల్వే స్టేషన్ ఆధునీకరించే పనుల్లో వెయిటింగ్ హాల్ నిర్మాణం పూర్తయిందని, టాయిలెట్స్ ఇంకా అందుబాటులోకి రాలేదని, రెండో ప్లాట్ ఫారం పూర్తిగా నిర్మాణం జరగలేదని, మెట్ల మార్గం, ఆధునిక సదుపాయాలు మరో రెండు నెలల్లో అందుబాటులోకొచ్చే అవకాశం ఉందని తెలిపారు.

భవిత కేంద్రాన్ని సందర్శించిన లుపిన్ ప్రతినిధులు

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ భవిత కేంద్రంలో వికలాంగ విద్యార్థులకు అందిస్తున్న సేవలను పరిశీలించడానికి లుపిన్ ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి బి.రామకృష్ణ నాయుడు వారికి ఘన స్వాగతం పలికారు. భవిత కేంద్రం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో లుపిన్ ప్రతినిధులు మాట్లాడి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. వికలాంగ విద్యార్థుల కోసం సమగ్ర శిక్ష (ఎస్ఎస్ఏ) ద్వారా చేపడుతున్న పథకాలు, సదుపాయాలపై రామకృష్ణ వారికి వివరించారు. భవిత కేంద్రంలో వికలాంగులకు అవసరమైన ఉపకరణాల గురించి లుపిన్ ప్రతినిధులు ప్రశ్నించి, వారి అవసరాలను సమగ్రంగా అర్థం చేసుకున్నారు. కార్యక్రమంలో లుపిన్ ఫౌండేషన్ సిఎస్ఆర్ హెడ్ తుసారా శంకర్, జీవనోపాధి కార్యక్రమ హెడ్ యోగేష్ రౌత్, వర్క్‌సైట్ హెడ్ వెంకటేష్ శెట్టి, భవిత ఉపాధ్యాయురాలు టి. కుమారి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ కాలువ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-మునగపాక : ఇరిగేషన్ కాలువ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని మండలంలోని ఉమ్మలాడ గ్రామ రైతులు గురువారం తహశీల్దారు సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలోని "నాగులపల్లి అగ్రహారం ఇరిగేషన్" కాలువను కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు మట్టితో పూడ్చి దారి ఏర్పాటు చేసుకొని అన్యాయంగా ఆక్రమిస్తున్నారని తెలిపారు. దీని వలన ఉమ్మలాడ గ్రామ రైతులకు, నాగులపల్లి ఆయకట్ట రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని వాపోయారు. గ్రామాన్ని సందర్శించి ఆక్రమణలకు గురవుతున్న ఇరిగేషన్ కాలువను పరిరక్షించి గ్రామ రైతులకు, ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మొల్లేటి నారాయణరావు, అచ్చియ్య నాయుడు, కరోతి వెంకటేష్, పిల్ల అప్పలనాయుడు, ముల్లేటి వినోద్, ఇల్లూరి సత్తిబాబు, మంద రాము తదితరులు పాల్గొన్నారు.